పెళ్లాడతగ్గ మొగాడేడీ?

తూర్పు తెల్లవారుతోం దనగా జకరయ్యా, యెలిజబెత్తూ రైలు కోసం అనపర్తిస్టేషనుకి బయలుదేరారు. స్టేషను రాయవరానికి బిగిసి నాలుగు మైళ్లుంది; కనక యెండ తగలకుండా వెళ్లాలని వారు కొంచెం దురుసుగానే నడుస్తున్నారు. జకరయ్య చేతిలో చిన్నమూట తప్ప మరేమీ లేదు. యెలిజబెత్తు కులాసాగా కబుర్లు చెబుతూ పక్క పక్కనే నడుస్తోంది. ధవళేశ్వరంలో మిస్సమ్మ దగ్గిర గుమాస్తాగా వున్న తమ కుమారుడు కృపానందాన్ని గురించి వారిద్దరూ చాలా వుత్సాహంగా మాట్లాడుకుంటున్నారు.

ఆశపువారి తోట సమీపించా టప్పటికి మహేంద్రవాడలో టీచరుగా వున్న సామియేలు రామచంద్రపురం వెడుతూ వారి కెదురుపడ్డాడు. మొదట అతను భక్తితో వారికి సలాములు చెయ్యడమూ, ఆ దంపతులు ప్రేమతో అతగాణ్ణి దీవించడమూ, తరవాత కుశలప్రశ్నాదికమూ - ఇదంతా సక్రమంగా జరిగిపోయింది. అప్పుడు సామియేలు కృపానందం సంగతి యెత్తుకున్నాడు. "కృపానందం నాకు ప్రియమైన సోదరుని కంటేనూ యెక్కువ. అతణ్ణి చూస్తే నాకు ఆనందం పొంగిపోతుంది. నిన్న రాత్రే నేను ధవళేశ్వరంనుంచి వచ్చాను. అతను మీకు వెయ్యి సలాములు చెప్పమన్నాడు. మిస్సమ్మగారికి అతనిమీద వుండే ప్రేమ మరెవ్వరి మీదా లేదు. మీరు చాలా పుణ్యం చేసుకున్నారు. మీ కుమారుని కోసం గొప్ప అదృష్టం కనిపెట్టుకుని వుంది" అని అతను చెప్పగా వారికి బ్రహ్మానందం అయింది. "యేసుప్రభువు నిన్ను కాపాడుగాక. ప్రియమైన సామియేలూ! నువ్వు నాకు చల్లని కబురు చెప్పావు. నాకు కృపానందం యెలాంటివాడో నువ్వూ అలాంటివాడవే" అని దానికి యెలిజబెత్తు బదులు చెప్పగా, జకరయ్య "యిప్పుడు నువ్వు మాపాలిటి దేవదూతవైనావు. ఇవాళ మా కృపానందం పుట్టిన రోజు. ఈ పండుగ కోసం మా అబ్బాయి యేటా యింటికి వచ్చేవాడు; కాని యీ సంవత్సరం యీ వుత్సవం తమ బంగాళాలో జరగాలని మిస్సమ్మగారు చాలా పట్టు పట్టారు. అందుకోసం మేమే ధవళేశ్వరం వెడుతున్నాము" అని చెబుతూ సామియేలుని కౌగిలించుకున్నాడు.

తరవాత వుచితమర్యాదలు చేసుకుని వా రెవరి దారిని వారు వెళ్లిపోయారు.

2

ఈ సంభాషణవల్ల ఆ దంపతులు ముఖపద్మాలు చక్కగా వికసించాయి; కాని ఆలస్యం అయింది. భళ్లున తెల్లవారిపోయింది. అందుకు కంగారు పడుతూ జకరయ్య వడిగా ముందుకి అడుగు వేశాడు. "బిడ్డమీద అందరికీ చాలా ప్రేమగా

వుంది. ఈ సంతోషంవల్ల నాకు చాలా బలం వచ్చింది; కనక నీతో సరిగా నేను నడువగలను పద" అంటూ ఆమె అతని అడుగుల్లో అడుగు వేసింది.

సరిహద్దు పుంతలోకి వచ్చాటప్పటికి ఆ దంపతు లిద్దరూ వులిక్కి పడి నుంచునిపోయారు. చూడగా రోడ్డు పక్కని యీత రుప్ప చాటున వొక యువతి మూలుగుతూ పడివుంది. కట్టుకున్న మల్లుపంచె చాలా తెల్లగానే వుంది; గాని అక్కడక్కడ రోడ్డు బూడిద మరకలతోటీ, నెత్తురు మరకలతోటీ నానా బీభత్సంగానూ వుంది. దగ్గిరికి వెళ్లి చూడగా వొంటినిండా అరిటికాయల్లాగ కదుములూ, తాండ్ర బెత్తికల్లాగ బొబ్బలూ వున్నాయి. నెత్తిమీదా, కుడిభుజంమీదా, యెడమ మోకాలిమీదా గాయాలు పడి నెత్తురు అట్టకట్టి వుంది.

ఆస్థితి చూశాటప్పటికి వా రిద్దరి హృదయాలూ కరిగిపోయాయి. వెంటనే యెలిజబెత్తు "ప్రభువా! ఈ బిడ్డని రక్షించు" అంటూ దగ్గిరికి వెళ్లి కూచుని ఆమె శిరస్సు తన వొళ్లోకి తీసుకుంది. జకరయ్య "గాయాలు! గాయాలు" అంటూ ఆత్రపడుతూ దగ్గిర కూచున్నాడు. కమిలిపోయిన ఆపచ్చని శరీరం చూడగా వారికి వొళ్ళు జలదరించింది. యెలిజబెత్తు యువతి మొగమ్మీద కమ్మిన జుట్టు సవరిస్తూ "నీళ్ళు తీసుకుర"మ్మనగా, జకరయ్య మూట విప్పి చెంబు తీసి, బోదినుంచి నీళ్లు తెచ్చి అందించాడు. వెంటనే ఆమె చెంబు నోటి కందించబోయింది; గాని యువతి తల వూపి చెయ్యి పట్టుకుని "మీ రెవ?"రని అడిగింది.

"మేము క్రైస్తవులం"

"అయితే నన్నెందుకు ముట్టుకున్నారూ?"

"నీ స్థితి చూడలేకా"

"......"

"ను వ్విక్కడ యిలాగ యెందుకు పడివున్నావూ?"

"కొట్టి యీడ్చి పారేశారు"

"యెవరూ?"

"......."

"ని న్నెవరూ చూడలేదూ?"

"మహేంద్రవాడ బ్రాహ్మ లిద్దరు చూశారు"

"చూసి – నిన్ను యిక్కడే అట్టేపెట్టేశారేం?"

"అయ్యో......"

"పలకరించారా?"

"పులిని చూసినట్లు పారిపోయారు"

"ఏం?"

"అది మా జాతి లక్షణం"

"అయితే యిది మా జాతి లక్షణం"

"......."

"కష్టంలో వున్నవారికి సాయమూ, సేవా చెయ్యవలసిందని యేసుప్రభువు ఆజ్ఞ. ప్రజలకి దేవుని రాజ్యం చూపించి - జనులను నిజమైన మనుష్యులుగా చెయ్యడానికి మిషనువారు మమ్మల్ని రాయవరంలో నిలిపారు"

"......."

"మా సేవ పొందడానికి నీ కిష్టం లేకపోతే మీ వా ళ్లెక్కడ వున్నారో చెప్పు తీసుకు వస్తాము"

"యమదూతలనా?"

"మీ వాళ్లు యమదూతలా?"

"అంతకంటే అన్యాయం"

"అంటే?"

"యమదూతలు ఆయువు మూడితే గాని యెవర్నీ తీసుకుపోరు. మా వాళ్లు బతికి వుండగానే-"

"అయితే మే మెలా కనపడుతున్నామూ నీకూ?"

"దేవదూతల్లాగ"

దంపతులిద్దరూ చకితులైనారు. ఆమె ధోరణి వారికి బోధపడలేదు.

"అయితే మేము నీకు సేవ చెయ్యడాని కింక అడ్డెందుకూ?"

"నేను మీ కెవర్నీ?"

"ప్రాణికోటిలో మాకు సాటిదానవు. దేవుని రాజ్యంలో మాతో సమానంగా హక్కులు గల దానవు. ఇప్పుడు నువ్వు కష్టంలో వున్నావుకనుక, నీకు సేవ చేస్తే దేవుడు మాపాపాలు మన్నించి మాకు మోక్షం యిస్తాడు. ఇది యేసుప్రభువు మాకు-అందరికీ చేసిన మహోపదేశం"

యువతికి వ్యధితహృదయంమీద అమృతం చిలికినట్లయింది. ఆమె రెండు చేతులూ అప్రయత్నంగా అంజలిముద్ర వహించాయి. కళ్లు మూతలుపడ్డాయి. పెదిమలు రావిరేకల్లాగ కదిలిపోయాయి.

వొక్క నిమిషం అయిన తరవాత యువతి మళ్లీ కళ్లు విప్పి చూసింది.

"ఈశ్వరసంకల్పం యిలా వుంది కామోసు. దాన్ని అడ్డుపెట్టడానికి నే నెంతటిదాన్నీ? నాకింకా బతకాలనే ఆశగా వుంది. దేవుడిచ్చిన అయుర్దాయం కష్టమో సుఖమో నలుగురితో పాటు అనుభవించకుండా మధ్య కాలంలో యెందుకు తుంచేసుకోవాలీ? అలా చేస్తే మాత్రం శాంతి లభిస్తుందా? తుంచేసుకోవడం యీశ్వరతిరస్కారం కాదూ? నాకు చావు వస్తే యిదివరకే వచ్చివుండవలసింది. ఇంత పని జరిగాక కూడా నేను బతికి వుండడం చూస్తే నన్నింకా బతికి వుండమనే యీశ్వరు డాజ్ఞాపించినట్టు తోస్తోంది-"

"నీ కీ స్థితి–"

"రాత్రి పన్నెండు గంటలు దాటాక మా నాన్నా, మా అన్నలూ కొట్టి నన్నీతుప్పల్లోకి యీడ్చేశారు. అరగంట కిందనే నాకు చైతన్యమో, మెళుకువో వచ్చింది"

"మీ వాళ్లే ని న్నెందుకు కొట్టారు?"

"…. నేను పూర్వజన్మంలో యెన్నో పాపాలు చేశాను. లేకపోతే నాకీ జన్మ వచ్చి వుండదు…. మీరు చూపిస్తూ వున్న వాత్సల్యం చూస్తే నాకు ప్రాణాలు లేచివస్తున్నాయి"

"యేసుప్రభువు నిన్ను రక్షించుగాక"

"నా కిప్పుడు యేసు ప్రభువే గతి అయినాడు…. గొంతుకు యెండిపోతోంది…. మాట్లాడలేను"

"కసిన్ని మంచినీళ్లు పుచ్చుకో అమ్మా"

"తెల్లవారింది. మొగం కడుక్కోకుండా నే నిప్పుడు మంచినీళ్లు పుచ్చుకోను"

ఈదీక్షకి ఆశ్చర్యపడుతూ యెలిజబెత్తూ, జకరయ్యా ఆమెని భద్రంగాలేవదీసి, నెమ్మదిగా నడిపించుకువెళ్లి రోడ్డు పక్కని కూచోబెట్టారు. పుత్తరక్షణంలో ఆమె దంతధావనం చేసుకుని చెంబెడు నీళ్లు తాగి మళ్లీ పడుకుంది. అది చూసి "వుండు, వుం"డంటూ యెలిజబెత్తు మళ్లీ ఆమె శిరస్సు తన వొడిలోకి తీసుకుంది.

3

యువతి నాలుగు నిమిషాలు కళ్లు మూసుకుంది. ఇంతలో ఆ చెంబెడు నీళ్లూ ఆమెకి కొంచెం పుష్టి కలిగించాయి. వెంటనే ఆమె మెల్లిగా లేచి కూచుంది. "పడిపోతావు పడిపోతావు" అంటూ యెలిజబెత్తు ఆమె రెక్క పట్టుకుని ఆపింది; గాని తేలిపోతూ వున్న కళ్లతో ఆమె కమిలిపోయిన తన శరీరాన్ని వొకమాటు చూసుకుని వొక్క పెద్ద నిట్టూర్పు విడిచి కళ్లు మూసుకుని యెలిజబెత్తు వొడిలోకి పడిపోయింది. అది చూసి యెలిజబెత్తు "బిడ్డ తన గాయాలు చూసుకుని మూర్ఛపోయింది" అంటూ ఆత్రపడగా జకరయ్య గబగబ వెళ్లి మళ్లీ నీళ్లు తెచ్చి ఆమె మొగమ్మీద చిలికాడు. యెలిజబెత్తు తన పమిటచెంగుతో మెల్లిగా మొగంతుడిచింది.

మరో నాలుగు నిమిషాలికి ఆమె మళ్లీ కళ్లు విప్పి లేచి కూచుంది.

"మీ రిద్దరూ భార్యాభర్తలా?"

"……"

"అవును" అన్నాడు జకరయ్య.

"మీకు బిడ్డ లెందరూ?"

"వొక్క కొడుకు" అంది యెలిజబెత్తు"

"కూతుళ్లు లేరూ?"

"అయ్యో! ప్రభువా!"

"నన్ను కన్నవాళ్లకి నేను తొమ్మిదో యేటనే గర్భశత్రువు నైపోయాను. వారిద్దరూ యిప్పటికీ బతికే వున్నారు; గాని జ్ఞానం వచ్చాక నేను మాతృప్రేమనీ, పితృవాత్సల్యాన్నీ రుచేనా చూసి యెరగను. నా మొగం కనపడితే మానాన్నకి కళ్లు చిమచిమలాడిపోతాయి. మా అమ్మ చేతులారా చంపలేక తప్పించుకు తిరుగుతోంది. నా మొగుడన్న పిల్లాడు చచ్చిపోయినందుకు ఆవిడ దుఃఖిస్తూనే వుంది; కాని నాకు సుఖం కలిగించడం – కష్టాలు తప్పించడం తన విధి అని ఆవిడ కూడా భావించలేదు. "అనుభవించు" ఇదే షష్టిగడియలూ ఆవిడ బోధన"

"ఇప్పు డా గొడవ లన్నీ యెందుకు తల్లీ?"

"ఇది వొక కెరటం. సముద్రంలో కెరటాలెందుకు వస్తాయి? నా బతుకు సముద్రం అయిపోయింది. నన్ను మా వాళ్లే వితంతువుగా చేశారు; కాని కష్టాలు నేను అనుభవించాలి. జుట్టు తీయించకపోవడం వొకటే మావాళ్లు నాకు చెయ్యని అపకారం. నాలుగేళ్లనుంచి దానికోసం కూడా మా నాన్న రగడ పెంచుతూనే వున్నాడు; కాని నేను తరుచు మా చెల్లెలి దగ్గిర కాకినాడలో వుంటూ వుండడం వల్ల అది మాత్రం యింకా జరగలేదు"

"ఆయాసం వస్తుంది. అదంతా తరవాత చెబుదువు గాని లే అమ్మా"

"నా హృదయంలో నుంచి యీ దుఃఖం వుబుకుతోంది. దీనికి మీరు చూపుతూ ఉన్న ప్రేమే కారణం. మా జాతివాళ్ల లాగ మీ దారిని మీరూ పోయివుంటే నాకీ వుద్రేకం కలక్కపోవును. ఆధారం – "అయ్యో" అని సానుభూతి చూపించేవారు ఆదుకున్నారు; కనక పూర్వపు కష్టాలన్నీ జ్ఞాపకం వచ్చాయి..... మీకు కూతుళ్లు లేరన్నారు. నాకిప్పుడు నన్ను కడుపులో పెట్టుకునే తల్లిదండ్రులు కావాలి. మీరు నన్ను కూతురుగా ప్రేమిస్తారా?"

ఈ మాట అనేటప్పటి కామె కంఠం గద్గదికమై నేత్రాలు అశ్రుపూరితాలయిపోయాయి. ఆ సన్నివేశం చూశాటప్పటికి ఆ దంపతులుకి కూడా అలాగే తటస్థించింది. వెంటనే యెలిజబెత్తు ఆమెని పొదివి పట్టుకుని "తల్లీ! నువ్వు నా కూతురువు. నేను నీకు తల్లిని" అంది. జకరయ్య కూడా పుత్రికా వాత్సల్యంతో వోదార్చాడు. దీనితో యువతికి యేనుగు కున్నంత సత్తువ వచ్చింది. వెంటనే ఆమె యెలిజబెత్తుని గట్టిగా కౌగలించుకుని అతృప్తనయనాలతో ఆమె మొగం కేసి చూసింది. అప్పుడు యెలిజబెత్తు వుద్రిక్తహృదయంతో ఆమెని తన వక్షస్థలాని కదుముకుని, ఆమె కళ్లల్లో అమృతం వర్షించి, మాతృత్వానికి గుర్తుగా ఆమె నొసట వొక్క ముద్దు వుంచింది. తరవాత యువతి జకరయ్యమీదకి చేతులు చాపగా అతనా చేతులు గట్టిగా పట్టుకుని "తల్లీ! నిన్ను యేసుప్రభువు మాకు దయచేశాడు. ఆ ప్రభువునికన్న మేరీ అమ్మ. నిన్ను రక్షించుగాకా" అని డగ్గుత్తికతో చెప్పాడు.

"అయితే నన్ను మీయింటికి తీసుకువెళ్లండి. ఇక్కడ నన్నింకేమీ అడగవద్దు" అని ఆమె కోరగా వారిద్దరూ "సరే" అన్నారు.

4

ఇంతలో మహేంద్రవాడ రైతులు ముగ్గు రక్కడికి వచ్చారు. అందరూ శిలావిగ్రహాల్లాగ నుంచున్నారు: గాని అందులో వొకడు కొంతసేపటికి "యేమిటి గొడవ?" అని అడిగాడు. జకరయ్య దానికి తనకి తెలిసినంతవరకూ చెప్పి "రాయవరం వెళ్లి వొక బండి తెచ్చిపెడతారా?" అని అడగ్గా వారు ముగ్గురూ మారు చెప్పకుండా బోది దాటి అరటితోటలో మాయమైపోయారు. అందుకు దంపతు లాశ్చర్యపడుతూ వుండగా "మమ్మల్ని సాక్ష్యం వెయ్యడానికా? మేం తిరగలేం బాబూ పని మానుకుని" అని తోటలోనుంచి వినపడింది.

"నేను చెప్పలేదూ? మా పద్ధతి యింతే" అని యువతి చెప్పగా యెలిజబెత్తూ "యేం మనుష్యులమ్మా" అని తెల్లపోయింది. జకరయ్య "దయా దాక్షిణ్యాలున్న బాపతైతే వీరు బండి తేవడం దాకా యెందుకూ? వారు కొట్టి డొంకల్లోకి యీడ్చెయ్యడం యెందుకు వస్తుందీ?" అన్నాడు.

దానిమీద యువతి "యిక యిక్కడ క్షణమేనా వుండడం మంచిది కాదు. నేను నడవగలను. నింపాదిగా పదండి" అంటూ తూలుతూ తూలుతూనే లేచి నుంచుంది. "వద్దు వద్దు" అంటూనే యెలిజబెత్తు కూడా లేచింది: గాని యువతి అంతలో రెండడుగులే వేసింది. ఇక చేసేది లేక జకరయ్య కూడా వెంట బయలుదేరగా యువతి యెలిజబెత్తు భుజంమీద తల అనుకుని నడుస్తూ "క్షణం, అర మైలే కాదూ మనం వెళ్ళడం? బాధ లేదు. పదండి" అంది.

దారి పొడుగునా యెదురుపడ్డావా రంతా "యేమిటి సంగ"తని అడుగుతూ రాగా జకరయ్య "పుంతలో పడి వుంది. ఆసుపత్రికి తీసుకువెడుతున్నాం" అని మాత్రమే జవాబు చెబుతూవచ్చాడు.

పావుగంటలో వారు రాయవరం చేరుకున్నారు. మరో పావుగంటలో ఆసుపత్రిలో యువతికి కట్టు కడ్డడమూ, మం దివ్వడమూ జరిగిపోయింది. మొత్తానికి యెనిమిదిం బావు అయాటప్పటికి దంపతులు యువతిని వెంటబెట్టుకుని యింటికి చేరుకున్నారు.

అది చాలా చిన్న యిల్లు, పూరిల్లు కూడాను. వొక గది, వొక వంటగది, వొక హాలు, మూడు వేపుల వసారాలు. ఇంతే ఆ యిల్లు; కాని అది చూపులికి చాలా ముచ్చటగా వుంది. ఎటు చూసినా చాలా పరిశుభ్రమైన గాలికీ వెలుతురికీ లోటు లేకుండా వాసయోగ్యంగా వుంది. ఇంటి చుట్టూ పువ్వుల మొక్కలూ, తీగలూ - అది వుద్యాన వనంలో వున్న బంగళాలా వుంది. ఆ చక్కదనాని క్కూడా యువతి చప్పున తేరుకుంది.

యెలిజబెత్తు నిమిషాలమీద వంట చేసేసింది. అప్పటి కప్పుడే జకరయ్య స్నానం చేసి బట్టలు మార్చుకున్నాడు. యెలిజబెత్తు యువతికి చాకింటి మడత కట్టబెట్టి ఆమెకీ, జకరయ్యకీ పింగాణీపళ్లేలలో అన్నమూ, కూరా వగైరా వడ్డించింది.

యువతి వొక్క క్షణం భ్రాంతురాలై వుండి, వుత్తరక్షణంలో ఆకాశంకేసి చూస్తూ అంజలిబంధంతో “ఈశ్వరా! అంతా నీకు తెలుసు. నువ్వే నాకు దిక్కు” అని మొక్కి భోజనం ప్రారంభించింది.

5

ఇదంతా ముగిశాటప్పటికి పది అయింది. జకరయ్య యెలిజబెత్తుకేసి చూసి “ఇది మనం ధవళేశ్వరం చేరుకునే సమయం. అబ్బాయి రాజమండ్రి స్టేషనులో నిరుత్సాహపడి, కారణం తెలవని ఆవేదనతో బంగాళాకి వెళ్ళిపోయివుంటాడు” అన్నాడు. దానికి యెలిజబెత్తు “బిడ్డ నిరుత్సాహపడడం నిజమే; కాని ప్రభువు మన కీ పని పెట్టాడు. అబ్బాయి పుట్టిన రోజు వుత్సవంలో మనం అక్కడ అనుభవించే ఆనందం కంటే యిక్కడ యీబిడ్డకి సేవ చెయ్యడంవల్ల కలిగే ఆనందం గొప్పదిన్నీ, శాశ్వతమైనదిన్నీ. అక్కడ మిస్సమ్మగారి దయవల్ల బిడ్డ కే లోటూ జరగదు. ఆ కారణంవల్ల కూడా మన ఆనందానికి కొరత లే”దని మాతృహృదయాన్ని వెల్లడించింది.

ఇది విని యువతి “సంగతి యేమి?”టని అడిగి జకరయ్య అంతా చెప్పగా “అయ్యో? నామూలంగా మీ ఆనందాని కెంత విఘాతం కలిగిందీ?” అని విచారించింది; కాని యెలిజబెత్తు “బిడ్డా! దానికోసం మాకు విచారం లేదు. నా కొడుకు పుట్టిన రోజున నాకు రత్నం వంటి కూతురు దొరికింది. మా మీద యేసుప్రభువుకి కటాక్షం వుందనడానికి ఇంతకంటే యేం నిదర్శనం కావాలీ?” అని చెప్పి ఆమెని ఓదార్చింది.

దానిమీద యువతి యిలా చెప్పింది.

“నిజమే. నాకూ యివాళ ‘అమ్మా!’ అని పిలవతగిన తల్లీ, ‘బాబయ్యా’ అని పిలవతగ్గ తండ్రీ దొరికారు. ఈ సౌభాగ్యానికి సోపానంగానే నిన్న రాత్రి నేను పరమదౌర్భాగ్యం అనుభవించవలసి వచ్చింది. వాళ్ల క్రోధం దేవుని దయవల్ల నాకు అదృష్టంగా పరిణమించింది. ఇక నా సంగతి చెబుతా వినండి. నాపేరు సుభద్రమ్మ. మా కుటుంబం పొలమూరు నూరిళ్ల బ్రాహ్మణాగ్రహారంలోనూ చాలా యెన్నిక అయింది. బ్రాహ్మ లంతా మా కుటుంబం అంటే యెంతో గౌరవంగా చూస్తారు. బ్రాహ్మణమాత్రు లెవరూ మాయింటో ఆగలేరు. అంటే మాయింటో అందరూ నిప్పూ నీరూ కడుగుతారు. అలాంటి కుటుంబంలో నేనూ మా చెల్లెలూ మాత్రమే మారిపోయాం. నాకు ముగ్గురు అక్కలూ, వొక చెల్లెలూ, యిద్ద రన్నలూ వున్నారు. నేను తరుచు కాకినడలో మాచెల్లెలి దగ్గిర వుంటున్నాను. మామరిది కాలేజీలో

మేష్టరు. అతనికి బ్రహ్మసమాజం అంటే అభిమానం. తల్లి యింకా బతికివుండడంవల్ల అతనింకా ప్రత్యక్షంగా ఆమతంలో కలవలేదు: గాని కలిసినట్టే లెఖ్ఖ. ఆమెకి యెనభై యేళ్లున్నాయి. నేడో రేపో అంటూ వుంది. నన్ను కాస్త బూడిద చేసేసి తరవాత నీయిష్టం అంది ఆవిడ. మా మరిది మూలంగా మా చెల్లెలు ఆయిద్దరి మూలానా నేనూ పూర్తిగా మారిపోయాము. మా మరిది కాలేజీ నుంచి రాగానే మా కిద్దరికీ చదువు చెప్పడమూ, ఈకాలపు మర్యాదలూ పద్ధతులు నేర్పడమూ - పాపం అతగాడికి విసుగంటు లేదు. ఇరుగు పొరుగు అంతా ఆమతస్థులే కావడంవల్ల తరుచు నేను వారి యిళ్లకు వెడుతు వారి ఆచారవ్యవహారాలు చూస్తూ నేర్చుకుంటూ వుంటాను. ఆ స్త్రీల పరిచయంవల్లా, మా మరిది బోధనల వల్లా బ్రాహ్మణ జాతి అంటే రాక్షసజాతి అని బోధపడింది. వొక దయ లేదు. దాక్షిణ్యం లేదు. వేదాలూ, శాస్త్రాలూ చదవడమే; గాని అసత్యానికీ, హింసకీ జంకడం లేదు. నిప్పు నీళ్లు కడగడం - యిలాంటివే బ్రాహ్మణలక్షణాలని వాళ్ల నమ్మకం. ....మా చెల్లెల్ని విడిచి వుండలేకపోవడం వొకటీ, పొలమూరు నరకంలో పడి బాధ పడలేకపోవడం వొకటీ ఈ రెండు కారణాలవల్లా నేను తరుచు కాకినాడలో ఉంటున్నాను. నాకు మళ్లీ పెళ్లి చేసుకోవాలని బుద్ధి పుట్టింది. ఈబుద్ధి పుట్టటప్పటికి నామనస్సు పొలమూరిలో వొక బ్రాహ్మడిమీదపడింది. కానైతే అతగాడు పెద్ద చదువు లేమీ చదవలేదు. ఆస్తి గూడాసామాన్యమే. కాని చిన్నప్పు డిద్దరమూ ఆడుకునేవాళ్ళం, మాలో మేము అతను మొగుడనీ నేను పెళ్లాన్ననీ అనుకునీవాళ్లం, సరిగా సమయానికి, ఆరుమాసాల క్రిందట అతని పెళ్లాం కాపరానికి రాకుండానే కలరా వచ్చి చచ్చిపోయింది కూడానూ. మా మరిది కాకినాడలో యెన్నో సమ్మంధాలు చూపించాడు; గాని నామనస్సు అలా పోలేదు. మా చెల్లెలు “పొలమూరు బ్రాహ్మడు అంతపని చెయ్యలేదు సుమా” అంది. పొలమూరు పిల్లని నేను చెయ్యగలిగినప్పుడు అతను మాత్రం యెందుకు చెయ్యలేడూ?” అన్నాను నేను. కాకినాడలో వుండడంవల్లనే నాలో మార్పు కలగడం నిజమే. పొలమూరిలోనే వుండిపోవడంవల్ల అతనిలో మార్పు కలగడాని కవకాశం లేకపోవడం గూడా వాస్తవమే; కాని నా ఆశ అలా అనిపించింది.... ఈ ఆశతో పొలమూరు వెళ్లాను. అతను పెళ్లి ప్రయత్నంలోనే వున్నాడు; గాని యింకా స్థిరపడలేదు. అతని యిల్లు మాయింటిపక్క సందులోనే వుండడంవల్ల యెలాగో వీలు చేసుకుని వెళ్లి మొదట పరామర్శ చేసి, తరవాత సమ్మంధాల సంగతి యెత్తి చివరికి అతికష్టంమీద “వితంతువుని పెళ్లి చేసికోరాదుటోయీ?” అన్నాను. దానితో అతను ప్రకృతిలో పడ్డాడు. నాకేసి కొత్త చూపులు చూపించడం మొదలుపెట్టాడు. కొంచెం పరియాచకం - హాస్యం - వేళాకోళాలు - వెక్కిరింతలు - తుదకి ప్రేమభిక్ష; కాని పెళ్లి చేసుకోవా లనే వుద్దేశం మాత్రం లేదు. కాలం గడుపుకోవడం - వీలయినపుడు మంచి పిల్లని చూసి పెళ్లి చేసుకోవడం - ఇదీ యెత్తు; కాని యీ దురుద్దేశం నాకు తెలిసినప్పట్నుంచీ నే నతని యింటికి వెళ్లడం మానేశాను. దాసీదానిచేత కబుర్లు

వచ్చాయి. దారి కాసి బతిమాలడం- ఏమేమో వంకలు పన్ని మా యింటికే రావడం - ఇలాంటి వన్ని సాగించాడు. అయితే ఎన్ని బిత్తిరీలు చేసినా నేను లొంగలేదు. "పెళ్లి చేసుకుందాం. లేకపోతే దూరంగా వుండు" అని నేను కచ్చితంగా చెప్పేశాను. ఇదంతా అయేటప్పటికి పదిహేను రోజు లయింది.

..... తరవాత యేం జరిగిందో తెలవదు; గాని వొకనాడు సాయంత్రం దాసీది ఒక జాబు తెచ్చి యిచ్చింది. "నీ సెలవు ప్రకారం నిన్ను పెళ్లి చేసుకోవడానికి నిశ్చయించుకున్నాను. నువ్వెప్పుడు ఎక్కడికి రమ్మంటే అక్కడికి సిద్ధం" అని వుంది ఆ జాబులో. మొదట కొంచెం అనుమానపడ్డాను; గాని చివరికి పొంగిపోయాను. ఈ వయస్సులో కోరుకున్న భర్త లభించడం కంటే ఆడదాని కిక కావలసిం దేమిటీ? కాని జాబు వచ్చిన యింకో గంటకి ప్రళయం ముంచుకు వస్తోన్నట్టు తెలిసింది. మారహస్య వ్యాపారం కొందరు విద్యార్థులు కనిపెట్టారు. అది ఆనోటా, ఆనోటా పాకింది. చివరికి మా అమ్మకి తెలిసింది. మా అమ్మ మా పెద్దక్కతో చెప్పింది. అది వచ్చి "యేం తలుచుకున్నావే మొండి పీనుగా" అంటూ నన్నొక్క మొట్టు మొట్టి అడిగింది. అంతట్లో మా అమ్మ వచ్చి "వూరుకో. వూరుకో రేపు మీ నాన్నతో చెబుదాం బుద్ధి మళ్లించుకోకపోతే" అంటూ మా అక్కని లాక్కుపోయింది; కాని నా పై ప్రాణాలు పై కెగిరిపోయాయి. "యిది యెలా పొక్కిందీ? ఏ మవుతుందీ? ఇది మొగాళ్లకి తెలిస్తే పెళ్లి మాట దేవు డెరుగును. ఇంకనన్ను కాకినాడ వెళ్ల నిస్తారా? బుర్ర గొరిగించకుండా వుంటారా? ఈ నరకంలో పడి బతకడ మెలాగా?" ఇలాగ నా మనస్సు అనేకవిధాల పోయింది. నిజంగా కంగా రెత్తిపోయింది నాకు.... ఆ వేళ సాయంత్రం దాసీది మరో చీటి తెచ్చి యిచ్చింది. చూడగా దాన్లో "మన సంగతి బట్టబయ లైపోయేట ట్టుంది. ఇక యిక్కడ వుంటే మనకి ప్రాణాలు తక్కువు. తక్కినా నువ్విక తల యెత్తుకుని తిరగడానికి వీలుండదు. అంతా అయోమయం అయిపోతుంది. కనక రాత్రి పన్నెండు గంటల వేళ నువ్వెలాగేనా చెరువు దగ్గిరకి వస్తే నేను కలుసుకుని మారు దారిని తెల్లవారేప్పటికి నిన్ను కాకినాడలో మీ చెల్లెలిగారీ యింటో వప్పగిస్తాను. వెంటనే - రేపే మనం పెళ్లి చేసేసుకోవచ్చు"నని వుంది... నాకు మళ్ళీ ఆశ కలిగింది. విరుచుకు పడిపోయే ఆపద తప్పిపోయినట్లు తోచి మనస్సు కొంచెం కుదుటపడింది; కాని రాత్రి పన్నెండు గంటలవేళ చెరువు గట్టుకు వెళ్ళాలి. యెలాగా? రాత్రి మా పెద్దక్క కాస్తే యేమిటి చెయ్యడం?.... అప్పటి స్థితి యెలా వుంటుందో? వెళ్ళాలి. తప్పదు" అని నిశ్చయించుకున్నాను... నాకు నిద్ర రాలేదు. ముసుగు - గాలికూడా ప్రవేశించడానికి వీలు లేనట్టు బిగించాను; కాని వేయి కళ్ళతో చూస్తూన్నట్టు అంతా కనిపిస్తూనే వుంది. లక్ష చెవులతో వింటూన్న ట్టంతా వినపడుతూనే వుంది.... పక్కయింటో గడియారం పన్నెండు కొట్టింది... మెల్లిగా ముసుగు తీసేశాను. అది శీతాకాలం కనక అందరూ గాఢనిద్రలో వున్నారు. లేచి, ముంగాళ్ళమీద నడిచి, మెల్లిగా తలుపులు తీసుకుని - క్షణంలో చెరువుగట్టుమీద పడ్డాను. .... అప్పటికప్పుడే అతనక్కడ కనిపెట్టుకుని వున్నాడు...

"ఇప్పు డనపర్తి వెడితే తప్పకుండా మీవాళ్ళు వెతుక్కుంటూ వచ్చి పట్టుకుంటారు. రాయవరం వెళ్ళి జట్కామీద రామచంద్రపురం చేరుకున్నామంటే ప్రత్యేకంగా మోటారు చేసుకుని తూర్పు తెల్లవారకుండా కాకినాడ వెళ్ళిపోతాం. ఏమంటా" వన్నా డతను. నాకూ అది బాగానే కనపడింది. "సరే" అంటే "సరే" అనుకున్నాం... బయలుదేరాం. మాకు చీకటి అడ్డురాలేదు. చలికూడా కనపడలేదు. ఇద్దరమూ వొక మాటా మంతీ కూడా లేదు. ఉరుకులతోటీ, పరుగులతోటీ వెనక్కాల మమ్మల్నెవరో తరుముకు వస్తూన్నట్టు మేఘాలమీద యెగిరిపోతున్నాం... కాని మావాళ్ళు మా వెనక్కాలే వస్తున్నారు. మే మది కనిపెట్టే లేకపోయాం. నేను పడివున్నచోటికి వచ్చాటప్పటికి మా చిన్నన్నయ్య వచ్చి "మాదిగిముండా! యెక్కడికి వెడతా" వంటూ చెయ్యి పట్టుకున్నాడు... దాంతో నేను కెవ్వున కేక వేసి కూలబడ్డాను. వెంటనే మా నాన్న దెబ్బమీద దెబ్బకొట్టసాగాడు. మరో నిమిషానికి మా అన్నలు కూడా సాయపడ్డారు... అందరూ నన్ను గొడ్డుని బాదినట్టు బాదేశారు. చివరికి కఱ్ఱదెబ్బ నెత్తిమీద పడింది. అంతే. దాంతో నాకు కళ్ళు తిరిగిపోయాయి. తరవాత యేం జరిగిందో? ఎవళ్ళేమయిపోయారో?.... తెల్లవారేక – అంతా మీకు తెలిసిందే"

ఇది పూర్తి అయాటప్పటికి సుభద్ర హృదయం తేలికపడింది.

ఇది విని దంపతు లిద్దరూ "యేసుప్రభువా!" అంటూ నిట్టూర్పులు విడిచారు.

6

"అమ్మా! డాక్టరుగారి నడిగి సర్టిఫికెట్టు తెమ్మంటావా?" అని జకరయ్య అడగ్గా "బాబయ్యా! యేసుప్రభువుకి గూడా సర్టిఫికెట్టు కావాలా?" అని సుభద్ర బదులడిగింది.

"కోర్టుకి వెడితే సాక్ష్యం యెలా వస్తుందీ–?" అని యింతవరకూ తొక్కిళ్ళాడుతూ వున్న జకరయ్య యిది విని గతుక్కుమన్నాడు.

అక్కడ, పొలమూరిలో ప్రజలందరూ రాత్రి వీరావధాని చేసి చేయించిన దారుణకృత్యం విని ఆశ్చర్యపోతూ వుండగా సుభద్రమ్మ కిరస్తానీలలో కలిసినట్టూ వార్త వచ్చింది. దీనితో వూరంతా గుబ్బు మని పోయింది.

వీరావధానీ, పెద్ద కొడుకూ నిర్విచారంగానూ, సావకాశంగానూ దేవతార్చనా భోజనమూ చేసి లోపలి అరుగుమీద కూచుని "ఏం జరిగిందో?" అని ఆలోచిస్తూ వుండగా చూసి రావడానికి వెళ్ళిన రైతు వచ్చి తెల్లవారింది మొదలు జరిగిం దంతా చెప్పాడు. అదివిని లోపల్నుంచి వచ్చి పెద్ద కూతురు "అది చచ్చిపోయిం దనుకుందాం. ఏం?" అంది; కాని యీ మాట వినిపించుకోకుండా అవధాని "నా పిల్లని లేవతీసుకుపోయా రని కిరస్తానీ వాళ్ళ మీద ఛార్జీ తగిలిపించా" లంటూ బుసబుసలాడుతూ గభీమని లేచినుంచుని నడుం బిగించాడు. ఆ వుద్ధృతం చూసి

రైతు తెల్లపోతూ వుండగా పెద్ద కొడుకు "నువ్వు తొందరపడకు నాన్నా!" అని శాంతపరిచి "పేరిశాస్త్రిని తీసుకు రారా" అంటూ తమ్ముణ్ణి పంపించాడు.

"ఏం నాన్నా! ఇదంతా చేసింది రామశర్మగాడు కదా. వాణ్ణి విడిచిపెట్టి కిరస్తానీల మీద యివ్వడం యెందుకూ ఛార్జీ? ఇలాంటి వెధవలు వూళ్ళో వుంటే తక్కిన వెధవపిల్ల లంతా చెడిపోతారు" అని పెద్దకూతురంది; కాని అవధాని దానికి జవాబివ్వలేదు.

పేరిశాస్త్రి వచ్చాడు. అతనా వూళ్లో ఏజెంట్లలో ప్రముఖుడు. చూస్తూ వుండగా తల మార్చి తల పెట్టడంలో చాలా తెలివైనవాడు.

శాస్త్రి అంతా విని పక్కా పావుగంటసేపు ఆలోచించాడు. ఈ లోపుగా అవధాని "రెండు వేల రూపాయల నగలతో గూడా లేవతీసుకుపోయినట్టు ఛార్జీలో చేర్పించా"లని ధృవపరుచుకున్నాడు.

"కిరస్తానీలమీద ఛార్జీ యివ్వా లంటారా?"

"అవును"

"మీ అమ్మాయిని వాళ్ళే లేవతీసుకుపోతే మరి దాని వొంటిమీద దెబ్బ లెలా వచ్చాయి?"

"......"

"కిరస్తానీల ప్రోత్సాహంతో సుభద్రే మీ మీద ఛార్జీ యిస్తే?"

అవధానికి మాట రాలేదు. కొడుకు లిద్దరూ శాస్త్రికేసి చూస్తూ కూచున్నారు. అప్పుడు పెద్దకూతురు "వంశంలో యిలాంటి వెధవపీనుగులు పుడితే అన్నీ చిక్కులే కాకపోతే మరే మౌతుందీ? నాలుగేళ్లనుంచి పోరుతున్నాను దాని క్కూడా బుర్ర గొరిగించెయ్య మనీ, విన్నారా యెవరేనా?" అని టకాయించి అడిగింది. ఆమె యిలా అంటూ వుండగా "యేమి టేమిటి?" అంటూ ముసలావిడ వచ్చింది; కాని యెవరూ సమాధానం చెప్పలేదు.

"కిరస్తానీలమీద మీరు ఛార్జీ యిచ్చినా, మీ మీద సుభద్ర ఛార్జీ పెట్టినా మీ పని కడుపు చింపుకుంటే కాళ్లమీద పడ్డట్టవుతుంది. మీరు కొట్టిన దెబ్బలు చాలా దారుణంగా వున్నాయిట. అవి చూస్తే యెలాంటి వాళ్ళూ కూడా మీపక్షంగా మాట్లాడలేరుట. పైగా "ఫలానా కిరస్తానీని పెళ్ళాడడానికి స్వయంగా నేనే వెళ్ళిపోయా"నంటుంది మీ అమ్మాయి. అదిమీకు మరీ అపకీర్తికరం"

"......"

"కనక, మీరిప్పుడు కాసుకోవడంలోనే వుండాలి. ఇంతకీ: అక్కడి వుద్దేశాలూ, ప్రయత్నాలూ యెలా వున్నాయో తెలుసుకోవాలి. వీలుతప్పితే పది రూపాయలు పారేసేనా కేసు రాకుండా చేసుకోవాలి; గాని మనకి మరో ధారి కనపడదు. ఈ స్థితిలో రామశర్మమీద ఛార్జీ పెట్టినా మనకి చిక్కే. ఏమంటే? స్థితి యెలాగా విషమించింది కదా అని వాడు కిరస్తానీలతో లాలోచీ అయితే?"

'......"

"ఎన్ని విధాల చూసినా నాకు, మీకు అనుకూలించే సాధనా లేమీ కనపడ్డం లేదు. ఏమీ ఆలోచించకుండా దారుణమైన పని చేసేశారు. ఇప్పుడది విషమించుక్కూచుంది"

అప్పుడు ముసలావిడ అందుకుంది.

"కూచోదూ? కూచోదా అంట. అది యిల్లు దాటిందని తెలిశాటప్పటికి ముగ్గురూ కర్రలు పుచ్చుకుని యములాళ్ళలాగ బయలుదేరారు. వెనకాల నే నెంత మొత్తుకుంటూ వున్నా విన్నారా? యీ పెద్ద పీనుగు కూడా వాళ్లని యెగసం దోసింది; కాని వెనక్కి తియ్యలేకపోయింది. ఇక వెనకాముందూ చూడకుండా దూది యేకినట్లు–"

"మొండిపీనుగా! పోరి, దాన్ని కాకినాడ పంపించినదానవు నువ్వా? ఆ బ్రహ్మసమాజంగాడు దాని బుద్ధి మార్చేశాడు. వాడిక నాగుమ్మంలో అడుగుపెట్టగలడా? అసలు నీబుర్ర పగలగొట్టవలసింది. అలా చేస్తే దానికి బుద్ధి వచ్చును"

ఆవిడ, ముసలాయనికి జవాబు చెప్పబోగా కొడుకులూ, పెద్దకూతురూ కాట్లకుక్కల్లాగ ధాముధూములు చేశారు; గాని ఆమె వెనక్కి తగ్గలేదు. "వోరే పేరన్నా? వీ ళ్లెంత గింజుకున్నా నాది కన్నకడుపురా నాయనా! కిరస్తానీది కావడం కంటే మళ్లీ పెళ్లి చేసుకోవడం మంచిది కాదుట్రా? ఏ మాదిగాడికో కట్టబెడతారు; గాని కిరస్తానీలు మాత్రం దానికి పెళ్లి చెయ్యకుండా వూరుకుంటారుట్రా? వీళ్లెంత యెగిసెగిసి పడ్డా లోకులు వాణ్ణి చూసి "పెద్దవధానులుగారి నాలుగో అల్లు"డని చెప్పుకోరుట్రా? నా కడుపు తరుక్కుపోతోందిరా నాయనా? రాత్రి తెల్లవార్లూ డొంకల్లో అది యేం బాధపడిందో? వీళ్ళు కొట్టిన దెబ్బలతో పాటు ముళ్లే గుచ్చుకున్నయె తేళ్ళే కుట్టాయో పాములే కరిచాయో నక్కలే పీకేయో - వెర్రిపిల్ల యెంత కందిపోయిందో? ఎన్ని గాయాలు తగిలాయో? (గుండెలు బాదుకుంటూ) "అమ్మా" అని నన్నెంత తలుచుకుందోరా తండ్రీ? మనస్సు విరిగిపోబట్టిగాని అది కిరస్తానీలలో కలిసే మనిషి ట్రా మళ్లీ జన్మకి నీకడుపున పుడతాను గాని అది కాకినాడలో చెల్లెలిదగ్గిరికి చేరుకునీ వుపాయం చేస్తూ తండ్రీ" అని బతిమాలుతూ ఆమె. బారుమంది.

పేరిశాస్త్రి మాట్టాడలేకపోయాడు; గాని తతిమ్మా అందరూ ఆమెని దులిపేశారు. దానిమీద ఆవిడ యిక చేసేది లేక "దాన్నేడిపించినవాళ్లు ముందుకు రా"రంటూ గిరుక్కున యింటోకి చక్కాపోయింది.

"కిరస్తానీలు ఛార్జీ యిస్తా రంటావా?"

"ఇవ్వడానికి మార్గాలున్నాయి. ఇస్తే మిషనరీ దొరలు వచ్చి స్వయంగా పని చేస్తారు. దొరలు పని చేస్తే కేసు బిగవక మానదు"

"........"

"పైగా ఇప్పుడు మన మేస్త్రీటు తురక కూడానూ. అగ్గికి గాలి-"

"ఏమిటి దారి?"

అవధానికి శరీరం స్వాధీనం తప్పిపోయింది. మాటకూడా తడబడడం మొదలుపెట్టింది.

"వూరుకుంటా వేమిరా?"

"ఏంచెయ్య మంటావూ?"

"వుపాయం లే దంటావా?"

"లక్ష వున్నాయి; కాని మాటలతో-"

"పారేద్దాం. ఏమాత్రం అవుతుందంటావు?"

"అక్కడి సంగతు లేమీ తెలవకుండా యేం చెప్పగలనూ?

"అయితే వెళ్లిరా"

"నాచేత నైనంత పని చేస్తాను"

"ముందేమాత్రం కావాలంటావు?"

పెద్ద కొడుకిలా అడగ్గా అవధాని "హో కాగితం యివ్వరా. పేరన్న మింగేస్తాడా యేమిటి?" అన్నాడు. వెంటనే పెద్దాతను నూరు రూపాయల నోటు తెచ్చి శాస్త్రి కిచ్చాడు.

శాస్త్రి తప్పని సరి వచ్చినట్లు నటిస్తూ దాన్ని పుచ్చుకుని పై కెత్తిపట్టి "యిది అగ్నిహోత్రం. కనక అతి జాగ్రత్తగా వాడతాను. ఇది యిలా వుండగానే పని జరిగిపోవచ్చు, లేక దీనితోనే సరిపోవచ్చు. చాలకపోవడంకూడా రావచ్చు; అయితే యిప్పుడేమీ చెప్పలేను. మీ రేమీ బెంగపెట్టుకోవద్దు; కాని కొంచెం - సాక్ష్యం తయారుచెయ్యడం మాత్రం మరిచిపోకండి" అని చెబుతూ అతను లేచి నుంచున్నాడు. తండ్రీ కొడుకులూ భారం అంతా నీదీ అని చెబుతూ అతన్ని వీధి గుమ్మందాకా సాగనంపారు.

7

శాస్త్రి రాయవరం వెళ్లి అనేక విధాల వాకబు చేశాడు; గాని సుభద్ర జకరయ్య యింటికి చేరుకుందనీ, అతని యింటో భోజనం చేసిందనీ మాత్రమే తెలిసింది. డాక్టరుగారివల్ల కొన్ని సంగతులు తెలుసుకోవచ్చు నని ఆసుపత్రికి వెళ్లగా ఆయన వూళ్లో లే రని తెలిసింది. మంత్రసాని వెటకారంగా మాట్లాడింది. "ఛార్జీలో యెవరెవర్ని చేరుస్తారు బాబూ?" అంటూ కంపౌండరు తలకాయ ఆడిస్తూ అడిగాడు.

శాస్త్రి నిరుత్సాహపడి మరో వీధికి బయలుదేరగా యిలాంటి వాడే రాయవరం కాపురస్థు డొకడు తారసపడ్డాడు.

"జకరయ్య చార్జీ యిప్పించకమానడు"

"ఊహూ!"

"మిషనరీలు వచ్చి పని చేస్తారు"

"అలాగా?"

"డాక్టరుగారు, కంపౌండరు; మంత్రసాని-లక్షమంది సాక్ష్యం చెబుతారు"

"......"

"ఆవిణ్ణి తండ్రీ, అన్నలూ కొడుతూ వుండగా మా లచ్చిరెడ్డి రాజమండ్రీనుంచి రైలు దిగి వస్తూ చూశాడు కూడానూ"

"......"

"అసలు ఆవిణ్ణి లేవదీసిన కుర్రాయన రామచంద్రపురంలో బోలెడు ప్రయత్నాలు చేస్తున్నాడు అప్పుడే"

"సరే"

"చివరికి జకరయ్య ఆవిణ్ణి తన కొడుక్కి పెళ్ళి చేసుకుంటాడు"

"బాగుంది"

అయితే యిదేమీ జరక్కూడ దంటే మనం చక్రం అడ్డువేసెయ్యగలం"

"దొరలు మాన నిస్తారా?"

"జకరయ్య కోర్టు కెక్కితే గదా దొరలు రావడం?

"అతను మానడం యెందుకు వస్తుందీ?"

"అదంతా మన చేతిలో వుందని చెప్పాను కాదూ? నన్ను తప్పించి యీవూళ్ళో క్రిమినల్‌గాని, సివిలు గాని జరగడం మీ రెరుగుదురా?"

"......"

"పైగా జకరయ్య నేను గీసిన గీటు దాటడు. దాటలేడు."

"ఏం?"

"అతనికీ మాకూ యిచ్చి పుచ్చుకోడా లున్నాయి. అత నీవూళ్ళో సుఖంగా వుండడానికి నేనే ఆధారం"

"అయితే యే మాత్రం?"

"మన సంగతి మీకు తెలిసిందే. మన దగ్గిర చిల్లర్లూ, బేరాలూ లేవు. మనం కలగజేసుకున్నామంటే అన్న ప్రకారం - యే మంటారు?"

"చెప్పండి"

"కష్టసుఖా లన్నీ ఆలోచించి మీరు చెబితే కాదంటానా?"

"అయినా, - చల్లకి వచ్చి ముంత దాచడం యెందుకూ?"

"నా కొక్క కాగితం చాలు"

"....."

"వులిక్కిపడ్డా రేం?"

"లేదు లేదు. ఇంకెవరెవరికీ?"

"జకరయ్యని కూడా మనం కూడగట్టుకోవాలి. అంతటికీ అతనే తెలిసిందా?"

"అంకె చెప్పండి"

"అయిదు - పెళ్ళిఖర్చు లిస్తే గాని అతను రాజీకి రాడు"

శాస్త్రి జవాబు చెప్పలేదు. నుంచోలేదు కూడానూ.

8

రాత్రి తొమ్మిదిన్నర అయింది. అప్పటి దాకా సుభద్ర పక్కలో కూచుని అకబురూ, యీకబురూ అడుగుతూ, చెబుతూ వున్న యెలిజబెత్తు "యిక పడుకోమ్మా" అంటూ తన పక్కమీదకి వెళ్ళికూచుంది. సరిగా యీసమయంలో గేటు గుంజుతూ యెవరో పిలిచారు. జకరయ్య హాల్లోనే పడుకుని వున్నాడు; కనక వెళ్లి తలుపు తియ్యగా "సుభద్రయ్యమ్మగో రున్నారా బాబూ" అంటూ వొక స్త్రీ లోపలికి వచ్చి నెత్తిమీది తట్ట కిందపెట్టింది. దానిమీద జకరయ్య "నీ దేవూరు? నువ్వెవరి మనిషివి? అవిడతో నీకేం పని?" అని అడిగాడు. అందుకా స్త్రీ "మాది పొలమూరు. నే నప్పలమ్మని. నన్ను వెంకుసోదెమ్మగో రంపారు" అని చెప్పగా అమాట విని ముందు సుభద్రా, ఆదేమిటో తెలుసుకోడానికి తరవాత యెలిజబెత్తూ యివతలికి వచ్చారు.

అప్పలమ్మ యేమి టేమిటో అడగ్గా సుభద్ర కొన్నిటికే జవాబు చెప్పి "నేను చచ్చిపోయానో లేదో చూసిరమ్మందా మా అమ్మ?" అని అడిగింది. "తండ్రీ అన్నలూ సుభద్రమ్మగారిని కుళ్లబొడిచి తుప్పల్లోకి యీడ్చేయ్యడం ఆవిడికి తెలిసిందా?" అని జకరయ్య అడిగాడు; గాని అప్పలమ్మ అది వినిపించుకోకుండా తట్టలోనుంచి వొక మూట తీసి సుభద్ర ముందుంచి "యీ మూట మీ అమ్మగారు పంపారని తెలిసినా, నేను తెచ్చానని తెలిసినా మా బుర్ర లెగిరిపోతాయి. ఇక నేను వెళ్లిపోవాలి. మా నాయడు నా కోసం రోడ్డుమీద నుంచున్నా"డని చెబుతూ లేచి నుంచుని, "మిమ్మ ల్నెలా గేనా కాకినాడ చేరుకో మన్నారు మీ అమ్మగారు" అంటూనే జువ్వలాగ వెళ్లిపోయింది.

తరవాత సుభద్ర యింగితం కనిపెట్టి యెలిజబెత్తు మూట విప్పి చూడగా అందులో సుభద్ర నగలు - ముక్కుపుడకల దగ్గిర్నుంచీ వున్నాయి. అది చూసి ఆమె "కన్న కడుపు. పాపం యెంత విచారిస్తున్నారో ఆ యమ్మగారు" అనగా, జకరయ్య "స్త్రీల ప్రేమ యింతటి దని యెవరూ పరిమితి చెప్పలేరు. అందులోనూ మాతృప్రేమ యెలాంటి సందర్భాల్లోనూ స్ఫుటంగా కనబడుతూనే వుంటుంది. దాన్ని అణచివెయ్యగల ప్రతికూలశక్తులు ప్రపంచకంలో యెక్కడా లేవు" అన్నాడు.

సుభద్ర రెండు కళ్లూ చెమ్మగిల్లాయి. పెదిమలు రావిరేకల్లాగ వణికిపోయాయి. వెంటనే ఆమె యేమీ మాట్లాడకుండా గదిలోకి వెళ్లి తన పక్క మీద గోడవేపుకి తిరిగి పడుకుని కుమిలి కుమిలి దుఃఖింపసాగింది.

తరవాత యెలిజబెత్తు నగలమూట జాగ్రత్త చేసి పడుకుంది. జకరయ్య జరిగిన దాని కాశ్చర్యపడుతూ ఆరుబైట పచారు మొదలుపెట్టాడు.

9

అప్పుడే సూర్యోదయం అయింది. గానుగు చెట్టు చిగురుటాకులు బాలభానుని లేత కిరణాలు పడి జిగిజిగ్గా మెరుస్తున్నాయి. పదహారు వన్నె బంగారాన్నీసడించే పొద్దుతిరుగుడు పువ్వులు విప్పారిన మొగాలతో కలకల్లాడుతూ సూర్యదేవునికి స్వాగతం యిస్తున్నాయి. అరవిచ్చి వున్న గులాబీ మొగ్గలు పిల్లగాలికి సుతారంగా వూగీస లాడుతూ కమ్మని సువాసనలు విరజిమ్ముతున్నాయి. విరగబూసి వున్న సైటుక్వీను తెల్లవార్లూ సౌరభవిలాసాలు ప్రదర్శించి అప్పుడే నృత్యం చాలించి బసకి వెడుతూ వున్న బోగంపిల్ల లాగ దయనీయమైన విలక్షణసౌందర్యంతో దర్శనీయంగా వుంది.

వొక మాదిగ యువతి హాలు తుడుస్తోంది. యెలిజబెత్తు పొగడచెట్టు కింద కూచుని కాఫీకోసం నీళ్లు కాస్తోంది. మల్లిపందిరి దగ్గిర యీజీచెయిరులో కూచుని సుభద్ర యోచనావ్యగ్రయై వుంది. నిన్న పేరిశాస్త్రితో రాయబారం నడిపిన సూటే జంటు చేమంతిమడి బాగుచెయ్యడం మానిపించి జకరయ్య కేదో నచ్చజెప్పా లని తాపత్రయపడుతూన్నాడు.

సరిగా యిలాంటి సమయంలో భోంయిమంటూ వొక కారు వచ్చి గేటుదగ్గిర ఆగింది. జ్ఞానప్రకాశం వెంటనే కారు దిగి "వచ్చా"రని యెదట వున్న యెలిజబెత్తుతో చెప్పి అక్కడికి కనపడుతూనే వున్న జకరయ్య కేసి మళ్ళాడు. హారన్ విని సుభద్ర లేచి నుంచుంది.

చూడగా చెల్లెలూ మరిదీనీ. ఆమె దుఃఖం ఆపుకోలేకపోయింది. కామేశ్వరమ్మ రెప్పపాటులో వచ్చి మీద వాలి "బతి కున్నావుటే బుల్లఅక్కయ్యా?" అ అంటూ బేర్రు మంది. సుందరం వదిన గారి శరీరం మీద వున్న తట్లూ, కట్లూ చూసి నిర్విణుడైపోయాడు.

ఇంతలో జకరయ్య అక్కడికి వచ్చాడు. జ్ఞానప్రకాశం పరిచయం చెయ్యగా జకరయ్యా, సుందరమూ మందహాసంతో పరస్పరమూ వందనాలు చేసుకుని చెయ్యీ చెయ్యీ పట్టుకుని మర్యాద నెరుపుకున్నారు. యెలిజబెత్తు కూడా వచ్చి నమస్కరించగా జ్ఞానప్రకాశం వల్ల ఆమె ఫలానా అని తెలుసుకుని సుందరం ప్రతివందనం చేసి "మీ దంపతుల కరుణవల్ల మా వదినగారు బతికి మాకు తక్కారు. ఏం చేసినా మేము మీ రుణం తీర్చుకోలేము. మీ వుభయుల యోగ్యతా విని మేము చాలా సంతోషించాము.

మునిదంపతులవంటి మిమ్మల్ని చూసిన యీ దినం చాలా సుదినం" అని ప్రశంస చేశాడు. వారు గూడా అతని సౌజన్యాన్నీ, హృదయ వైశాల్యాన్ని చాలా చాలా మెచ్చుకుని తమ సంతోషాన్ని వెల్లడించారు.

వీ రిలా మాట్లాడుకుంటూ వుండగా తలుచుకుని తలుచుకుని సుభద్రమ్మ, వినలేక వినలేక కామేశ్వరమ్మా పదినిమిషాల దాకా యేడ్చారు. తరవాత సూటేజంటు జ్ఞానప్రకాశాన్ని చాటుకు పిలిచాడు.

"వీ రెవరు?"

"చెల్లెలూ మరిదినీ"

"ఎందుకు వచ్చారూ?"

"తీసుకు వెళ్లడానికి"

"ఏమిటీ-?"

"ఇంకో అరగంటలో వెళ్ళిపోతారు"

"ఇంత తెలివి తక్కువవా దయిపోతున్నా డేమిటి జకరయ్యా?"

"ఏం?"

"అయిదు వందలు - కరుకులు - క్షణంలోనో, క్షణంలోనో చేతిలో పడిపోతాయి. ఎంతో కష్టపడి నేనీ పథకం పన్నాను. ఏమేనా తెలవాలా వద్దా?"

"ఏం చెయ్య మంటారూ?"

"వెళ్ళనివ్వకండి. దొర కోప్పడతాడని చెప్పండి. భయపెట్టండి"

"మా కెందుకూ ఆ గొడవ లన్నీనీ?"

"మాంచి ముమ్మరంలో వుంది పిల్ల. కృపానందానికి పెళ్ళి చేసుకోవచ్చు. సమయానికి పిలిచినట్టు వచ్చింది. దేవుడే పంపించాడు. ఎందుకు చెడతారు!

"మనకి వద్దండి"

"ఏం?..... బ్రాహ్మలంటే భయమా?"

"ఎందుకూ?"

"ఇంకేం మరీ?"

"ఆవిడ ఆపత్తులలో వున్నారు. నమ్మి మన యింటికి వచ్చారు. చెడు తలంపు తలిచా మంటే యేసు ప్రభువు మమ్మల్ని శిక్షిస్తాడు"

"కొడతాడా యేమిటి?"

"....."

"ఏం, నవ్వుతా వేం?"

"ఇలా పోనివ్వండి"

"నేను మీ కోసమే చెబుతున్నాను"

"సలాం"

"వినరూ? జకరయ్యకి చెప్పవూ?"

"....."

"నాకు వచ్చేది కూడా చెడగొడుతున్నారు. బాగా ఆలోచించుకోండి"

"అలా వేశారా యెత్తు? క్షమించండి"

"ఏ మంటావు?"

"సలాం, సలాం"

ఏజంటికి చాలా కోపం వచ్చింది. జ్ఞానప్రకాశం తిరిగి చూడకుండా చక్కాపోయాడు.

10

ఎనిమిదయింది. ఇక బయలుదేరకపోతే సుందరం వేళకి కాలేజీకి వెళ్లలేడు. అతనెప్పుడూ వొక్క నిమిషమేనా వేళదాటి వెళ్ళి యెరగడు. ప్రతీ విషయంలోనూ అతను చాలా నియమంగా వుంటాడు. ఈ సంగతి కామేశ్వరమ్మకీ, సుభద్రమ్మకీ గూడా బాగా తెలుసు.

అయితే ప్రయాణం ప్రస్తావన యెలా చెయ్యాలో సుందరానికి తోచలేదు. చివరి కతను కామేశ్వరమ్మ కేసి గంభీరంగా చూశాడు; కాని ఆమె కూడా యేమీ పాలుపోక అలాగే సుభద్ర కేసి చూసింది.

ఆ చూపులో సుభద్రమ్మకి కూడా ఆ సంగతి స్పష్టంగానే బోధపడింది. అయితే: ఆమె తనదే తరవాయి అని గ్రహించిన్నీ అంత వుపకారం - ప్రాణాలు నిలిపిన - తల్లినీ తండ్రినీ వెంటనే విడిచి వెళ్లడం యెలా గని ఆందోళపడుతూ తానుగూడా చెల్లెలికేసీ, మరిది కేసీ అలాగే గంభీరంగా చూసి, చివరికి యెంతో సంకోచపడుతూ మొదట జకరయ్య కేసీ, తరవాత యెలిజబెత్తు కేసీ బెదురు బెదురుతూ చూసింది.

ఆదంపతులు కూడా వీరంతా ప్రయాణం కోసం తొందరపడుతున్నా రని గ్రహించారు; కాని యెలిజబెత్తు యెటూ తోచక జకరయ్య కేసి చూడగా జకరయ్య అందుకున్నాడు.

"మీ వుద్దేశం తెలిసింది. మా స్వాధీనంలోకి వచ్చిన ప్రతీవారికీ మత దీక్ష యివ్వాలని మాకు మిషనరీలు చేసిన ఆజ్ఞ. దా న్ననుసరించి యిప్పుడు అమ్మాయికి మతదీక్ష యివ్వడానికి మాకేమీ ఆక్షేపణ లేదు; కాని మాకా సంకల్పం కలగలేదు. ఫక్తు పూర్వాచారపరాయణులైన వైదికబ్రాహ్మల యింటి వితంతుయువతి మాయింటికి రావడమూ, మాయింటో భోజనం చెయ్యడమూ-యివి సామాన్యవిషయాలు కావు. ఇంత జరిగిన తరవాత నిజానికిక క్రైస్తవ మతదీక్ష పుచ్చుకున్నా వొకటే, లేకపోయినా వొకటే. పైగా మీరు బ్రహ్మమతం మీద అభిమానం-"

"ఇదివరకే అభిమానం. ఇక ఆ మతదీక్ష పుచ్చుకోకుండా క్షణం వుండను. నిర్దోషురాలైన స్త్రీ విషయంలో యింతింత దారుణాలు తలవడానికి అవకాశా లిచ్చే యీ జర్జరితమతంలో యిక క్షణమేనా వుండలేను నేను. బ్రాహ్మణమతంలో మా వదినగారికి చోటు చాలదు. ఆమెని విడిచి మేముండలేము. పైగా: నా బోధనల వల్లనే ఆమెకి దృష్టి మారింది. కొత్త ఆశలూ, కొత్త సంకల్పాలూ కలిగాయి. అంచేతనే ఆమె యింతింత బాధలనుభవించవలసివచ్చింది. నిర్దోషురాలి కిలాంటి అవస్థ కలిగించినందుకు ప్రాయశ్చిత్తంగా కూడా నేను వెంటనే బ్రహ్మమతదీక్ష పుచ్చుకోవలసి వుంది."

"అయితే మరీ సంతోషం. సత్యం బోధపడిన తరవాత మీ వంటి విద్యాధికులు చెయ్యవలసిన పనే చెయ్యబోతున్నారు మీరు. మిమ్మల్ని ఆదర్శంగా పెట్టుకుని మీతోటివారంతా ప్రవర్తిస్తే యెంత బాగుండును?... ఇక ఆలస్యం చెయ్యను.

అమ్మాయి ఆరోగ్యం విషయంలో చాలా శ్రద్ధ వహిస్తారని నమ్ముతున్నాను. తరుచు వుత్తరాలు రాస్తూ వుండండి. తీరిక అయినప్పుడల్లా-సెలవయితే మే మిద్దరమూ వచ్చి-"

"ఎంత మాటా? మాయింటికి రావడానికి మీకు సెలవు కావాలా?"

"మీరు విద్యాధికులు. పెద్ద పదవిలో వున్నారు. నేను మీయెదుట-"

"మనిషికి వున్నతి కలిగించేవీ, గౌరవం కలిగించేవీ చదువూ పదవీ యెంత మాత్రమూ కావు. మంచి చెడ్డలు గ్రహించే శక్తి యెవరి కుంటుందో, అవివేచనని తమ నడతలో యెవరు చూపిస్తారో వారూ పెద్ద లంటే. ఈ దృష్టితో చూస్తే మీరు గురువులూ, నేను శిష్యుణ్ణీనీ"

"తమరలా సెలవియ్యవద్దు. మీతో వాదించి నేను నెగ్గలేను... అమ్మాయికి శీఘ్రంగానే సంపూర్ణారోగ్యం కలుగుతుందనీ, తరవాత వెంటనే యోగ్యుడైన వరుణ్ణి చూసి పెళ్లి-"

"బాబయ్యా! ఇక ఆ ప్రస్తావన వద్దు. పెళ్లి మీద ఆశ నాకు పూర్తిగా మళ్లిపోయింది. మళ్లీ అది కలుగుతుందని గాని, కలిగినా ఇంతలో కలుగుతుందని గాని చెప్పలేను. తన్నే నమ్మివచ్చిన నన్ను యములాళ్ల కప్పగించి పిరికిపంద - ఆ పిల్లాడు పారిపోయినప్పుడే నాకు పెళ్లంటే అసహ్యం పుట్టింది. స్త్రీల మానం కాపాడలేని జాతి యిది. స్త్రీల జీవితలక్ష్యాన్ని అర్థంచేసుకోలేని మతం ఇది. స్త్రీకి యుక్తవయస్సు రాకుండానే పెళ్లి చేసెయ్యాలనే నిర్బంధాన్ని సృష్టించడానికి ముఖ్య కారణం యేమిటో నాకిప్పుడు స్పష్టంగా బోధపడింది. జాతి కనుగుణమైన విద్య నేర్చిన బాలిక నిజంగా స్త్రీ రత్నం అవుతుంది. అలాంటి రత్నాన్ని సంపాదించాలంటే పురుషుడు పురుషకారాన్ని చూపించాలి. అది చూపించలేనివాడు శాశ్వతబ్రహ్మచారిగా వుండి పోవలసిందే;' గాని మరి దారి లేదు. అప్పుడు స్త్రీ ప్రాణికోటికి సహజమైన

సౌఖ్యమూ, ఆనందమూ అనుభవించడానికి జాత్యంతరుణ్ణి కూడా కోరితే కోరవచ్చు. ఇదే తటస్థిస్తే దేశానికి వొక విధమైన దౌర్భాగ్యం కలుగుతుందంటే నిజమే: ఇలాంటి వేమీ తటస్థించకుండా వుండాలనే మన పూర్వులు స్త్రీని పశువుగా తయారుచేసే సన్నివేశాలు కల్పించారు. అయితే వారు స్త్రీ పశువయిపోతే ఆ స్త్రీల చేతుల్లో పెరిగే మొగపిల్లలు పశుపతులయిపోతారని గ్రహించలేకపోయారు. ఇలాంటి అవిచారితధర్మాల నేర్పరచడంవల్ల తామే పశువులయిపోవడం కూడా వారుగమనించలేకపోయారు. త్రికాలజ్ఞానసంపన్నులని పొగడబడే మునులు ఇలాంటి అపసిద్ధాంతాలు ఏర్పరిస్తే జాతి నిర్వీర్యం అయిపోతుందనీ, దేశం అన్యాక్రాంతం అయిపోతుందనీ గ్రహించలేకపోయారు... ఇంతకీ; మామరిదిగారి బోధనలవల్ల నాకు ప్రపంచకం అంటే యేమిటో, స్త్రీ కర్తవ్యం యేమిటో విశదపడ్డాయి. మీ సౌజన్యాన్నీ, మీ కర్తవ్యపరాయణతనీ చూడడంవల్లా, అనుభవించడంవల్లా నాకు నేను చెయ్యవలసిన పని కూడా తెలిసింది. కనక నేనిప్పుడు పెళ్ళిసంగతి వెనక్కి తీసేస్తున్నాను. ఆంధ్ర స్త్రీలోకం యిప్పుడు నానాబాధలూ పడుతోంది. నాజీవితా న్నంతా స్త్రీలకూ పిల్లలకూ సేవచెయ్యడంలో గడిపేస్తాను. సేవలో వుండే సౌఖ్యమూ, ఆనందమూ మరి దేనివల్ల కలిగే వాటికీ తీసిపోవు. మీరంతా నాకు ఈసేవాదీక్షలో విజయం కలిగేటట్టు ఆశీర్వదించండి"

ఈమాటలు విని అంతా చకితులైనారు. చూడగా సుభద్ర మొగమ్మీద విలక్షణమైన తేజస్సు ధగధగ మెరిసిపోతోంది.

❀ ❀ ❀

విడిపోవలసిన క్షణం వచ్చింది. అందరూ కూడా మాట్లాడలేక మిడుతూ మిడుతూ చూసుకున్నారు. డ్రైవరుకి కూడా మాంద్యం వచ్చింది. మేఘాల మీద యెగిరిపోయే మోటారు కూడా మళుపు దాటీ దాకా కాళ్ళీడ్చుకుంటూ నే వెళ్ళింది.

(ప్రబుద్ధాంధ్ర - సెప్టెంబరు, 1934)